## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**నల్లగొండ:** పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలాచారి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పనులు జరుగుతున్న ప్రాంతాలైన రవీంద్రనగర్, రామగిరి, గాంధీనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

### తహసీల్దార్‌కు వినతి

**చండూరు :** మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ కంఠం భూములను కాపాడాలని సీపీఎం నాయకులు గురువారం తహసీల్దార్ దశరథనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ్‌గౌడ్, లింగయ్య, వెంకటేశం, వెంకటయ్య, స్వామి, వెంకన్న, రాజు, రామలింగం, నాగేష్,యాదయ్య పాల్గొన్నారు.

### సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**చిట్యాల:** మండలలంలోని వెలిమినేడు, పిట్టంపల్లి, ఆరెగూడెం గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీ సత్యనారాయణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పిశాటి భీష్మారెడ్డి, ఎదుళ్ల అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

### డీఎల్‌పీఓ విచారణ

**చిట్యాల:** మండలంలోని గుండ్రాంపల్లిలో గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం, అనుమతులు లేని వెంచర్ల ఏర్పాటుపై వచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం ఆ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నల్లగొండ డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ నిధుల వినియోగం, పన్నుల వసూలుపై వచ్చిన ఆరోపణలపై ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్యను, ఫిర్యాదుదాదురు మాజీ సర్పంచ్ బుచ్చిరెడ్డిని గ్రామస్తుల సమక్షంలో విచారించి వివరాలు సేకరించారు. అనంతరం గ్రామ పంచాయతీకి చెందిన పలు రికార్డులను పరిశీలన కోసం డీఎల్‌పీఓ తీసుకెళ్లారు.

### చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్

**తిప్పర్తి :** మండలంలోని అంతయ్యగూడెం గ్రామపంచాయతీ పరిధి గొల్లగూడెం స్టేటీ వద్ద గ్రామస్తుడు చిట్టిమల్ల భిక్షం జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం మాజీ సర్పంచ్ సిరిగిరి పద్మవెంకట్‌రెడ్డి జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నన్నూరి వెంకటరమణారెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకయ్య, దుర్గమ్మ, శంకరమ్మ, రవి, సింహాద్రి, సైదులు, పరుశురాములు, లక్ష్మయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

### సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమించాలి

**నాంపల్లి :** భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమించాలని ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. నాంపల్లి సీపీఐ కార్యాలయంలో గురువారం భవన నిర్మాణ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి నేతళ్ళ అగ్గిరాజు తదితరులు ఉన్నారు.

### కరపత్రాలు విడుదల

**నకిరేకల్ :** పట్టణంలోని శ్రీ సాయి మందిరంలో ఏప్రిల్ 6న నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవ ప్రచార కరపత్రాలను గురువారం మందిర చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి విడుదల చేశారు. అదేవిధంగా ఈ నెల 30న ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మందిర నిర్వాహకులు ఉప్పల వెంకటరమణ, తోనుపూనురి రాంబాబు, దాచేపల్లి శ్రీనివాస్, వలిశెట్టి భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఇఫ్తార్ విందు

**కేతేపల్లి:** మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.రవీందర్‌రెడ్డి, ఎండీ.యూసుఫ్‌జానీ, బీరవోలు శేఖర్‌రెడ్డి, కుమ్మరి నాగయ్య, ఎండీ.ఇబ్రహీం, నాజం అలీ, యూసుఫ్ పాల్గొన్నారు.

### ఈ ఫైలింగ్ కోర్సుతో భవిష్యత్

**నల్లగొండ :** ఇన్‌కం టాక్స్ రిటర్న్–ఈ ఫైలింగ్‌పై సర్టిఫికెట్ కోర్సు నేర్చుకోవడం వల్ల విద్యార్థులు భవిష్యత్‌లో ఆదాయ పన్ను ప్రొఫెషనల్స్‌గా స్థిరపడవచ్చని పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరాజు అన్నారు. గురువారం కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇన్‌కం టాక్స్ రిటర్న్ – ఈ ఫైలింగ్‌పై 30 రోజుల సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన మాట్లాడారు.

# అడుగంటిన భూగర్భ జలాలు



నోములలో నీరు లేక ఎండిపోయిన వరి పొలాల్లో మేత మేస్తున్న గేదెలు



నకిరేకల్ : ఓగోడులో నీరు లేక వెలవెలబోతున్న చెరువు

- నీరు లేక చెరువులు, కుంటలు వెలవెల
- ఎండుతున్న పచ్చటి పంట పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు

**నకిరేకల్:** చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేకపోవడంతో ఆయకట్టు రైతుల బతుకులు బండబారుతున్నాయి. గత సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వేసవిలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. పలు గ్రామాల్లో పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు 200–250 ఫీట్ల వరకు బోర్లు వేసే ప్రయత్నం చేసినా చుక్క నీరు రాకపోవడంతో కుదేలైపోతున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో తాగు నీటి సరఫరాకు ఆటంకం కలుగుతోంది. నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూర్, నార్కట్‌పల్లి, చిట్యాల, రామన్నపేట మండలాల్లోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటల్లో నీరు అడుగంటిపోయింది. నకిరేకల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో 83 చెరువులు, 211 కుంటలున్నాయి. వీటి కింది సుమారు 13,944 ఎకరాల్లో ఆయకట్టు ఉంది. వర్షాభావ పరిస్థితులతో చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో బోర్లపైనే ఆధారపడి రైతులు వ్యవసాయాన్ని సాగు చేస్తున్నారు. మరోవైపు బీడు భూములు దర్శనమిస్తున్నాయి.

**ఒట్టిపోయిన నోముల**

నకిరేకల్ మండలంలోని నోముల గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు సాగు చేసిన వరి పొలాలు ఎండిపోయాయి. ఏఎంఆర్‌పీ ప్రధాన కాల్వకు నీరు విడుదల చేసినప్పటికీ దిగువకు నీరు రాకపోవడంతో ఆ గ్రామ చెరువులోకి నీరు రాక బోర్లల్లో నీరు అడుగంటిపోయింది. నోముల గ్రామంలో సుమారు 200 ఎకరాల్లో వరి పొలాలు సాగు చేశారు. సుమారు 100 ఎకరాలపైనే వరి పైర్లు నీరు లేక ఎండిపోయాయి. గ్రామానికి చెందిన రైతులు తమ పంట పొలాలను కాపాడుకునేందుకు బోర్లు వేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఈ ఒక్క గ్రామమే కాదు. నకిరేకల్ మండలంలోని నెల్లిబండ, కడపర్తి, పాలెం, ఓగోడు, చందనపల్లి, మంగళపల్లి గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

**నకిరేకల్ నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు వాటి కింద సాగు విస్తీర్ణం**

| మండలం | చెరువులు | కుంటలు | విస్తీర్ణం(ఎకరాల్లో) |
|---|---|---|---|
| నకిరేకల్ | 13 | 84 | 2200 |
| కేతేపల్లి | 17 | 15 | 3200 |
| కట్టంగూర్ | 13 | 40 | 3500 |
| నార్కట్‌పల్లి | 10 | 30 | 1100 |
| చిట్యాల | 10 | 12 | 1500 |
| రామన్నపేట | 20 | 30 | 2444 |
| మొత్తం | 83 | 211 | 13,944 |

#### మూడున్నర ఎకరాల వరి ఎండిపోయింది



"చెరువు కింద ఉన్న మూడున్నర ఎకరాల్లో వరి సాగు చేశా. పంటను కాపాడుకునేందుకు రెండు బోర్లు వేసినా చుక్క నీరు రాలేదు. ఏఎంఆర్ డీ–51 కాల్వ నుంచి అయినా నీరు తెచ్చుకోవాలని సొంతంగా రూ.20 వేల ఖర్చు చేశా. చెరువులో నీరు లేకపోవడంతో నా భూమిలో ఉన్న ఒక్క బోరులో నీరు రాక సాగు చేసిన మూడున్నర ఎకరాలను వదిలేశాను.

–రాచకొండ లింగయ్య, రైతు, నోముల, నకిరేకల్ మండలం

#### బోర్లలో నీటి రాక తగ్గింది



"మా గ్రామంలో పెద్ద చెరువు ఈ ఏడాది ఎండకాలం రాకముందే చుక్క నీరు లేకుండా అడుగంటిపోయింది. దీంతో బోర్లలో నీటి రాక తగ్గిపోయింది. ఫలితంగా గ్రామంలో వరి పంటలు సాగు చేసిన రైతులు ఒక్కొక్కరు అర ఎకరం వరి చేను వదిలేశారు. వచ్చే నెలలో ఎండలకు పంట పొలాలు పూర్తిగా ఎండిపోయే అవకాశాలు ఉన్నాయి.

–కురెండ కృష్ణ, రైతు, ఓగోడు, నకిరేకల్ మండలం

## మైసయ్యగౌడ్‌ను కోల్పోవడం తీరని లోటు

**నల్లగొండ టూటౌన్:** ప్రజల కోసం, పార్టీ కోసం తాను నమ్మిన సిద్ధాంతం కోసం పని చేసిన నాయకుడు గుండగోని మైసయ్యగౌడ్ అని, ఆయనను కోల్పోవడం బీజేపీకి తీరని లోటని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సీహెచ్.అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. మైసయ్య వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైసయ్యగౌడ్ తన ప్రాణాలు లెక్క చేయకుండా ప్రజల కోసం పని చేశాడని కొనియాడారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, మైసయ్యగౌడ్ సతీమణి గుండగోని మారెమ్మ, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, గుండగోని గిరిబాబు, దోనూరు వీరారెడ్డి, బండారు ప్రసాద్, సాధినేని శ్రీనివాస్, పిల్లి రామరాజు, మిర్యాల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ టూటౌన్: మైసయ్యగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

**గట్టుప్పల్ :** బీజేపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి గుండగోని మైసయ్య వర్ధంతిని గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి గ్రామంలో గురువారం నిర్వహించారు. మైసయ్య విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రావుల ఎల్లప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు చిలువేరు దుర్గయ్య, బత్తుల జంగయ్యగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులకు విద్యార్థుల పాదాభివందనం

**నకిరేకల్ :** పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాలలో గురువారం అమ్మ వందనం కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలు కడిగి పాదాభివందనాలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాచకొండ నరేష్ పాఠశాల డీజీఎం రమణారెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఏట క్రాంతి, డీఎస్ శివప్రసాద్, వీపీలు హసీనా, గౌతమి పాల్గొన్నారు.

### క్రమశిక్షణతో చదవాలి

**నకిరేకల్ :** విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని ట్రస్మా అధ్యక్షుడు ఎర్ర శంభులింగారెడ్డి అన్నారు. నకిరేకల్ పట్టణంలోని మాస్టర్ మైండ్స్ స్కూల్ మొదటి వార్షికోత్సవం సాయి మందిర కల్యాణ మండపంలో గురువారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ కనుకుంట్ల సునీత వెంకట్‌రెడ్డి, ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత, సీఐ రాజశేఖర్, పాఠశాల చైర్మన్ రాజు, ఎంఈఓ మేకల నాగయ్య, కౌన్సిలర్ యాసారపు లక్ష్మీ వెంకన్న, కందాల భిక్షంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులు ఇష్టపడి చదవాలి**

**నాంపల్లి :** విద్యార్థులు కష్టపడి కాకుండా.. ఇష్టంగా చదవాలని తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మీ అన్నారు. గురువారం మండలంలోని పెద్దాపురంలో గల తెలంగాణ ఆదర్శ పాఠశాలను పసూనూర్, స్థానిక హైస్కూల్ విద్యార్థులు సందర్శించారు. సైన్స్‌ల్యాబ్, ఒకేషనల్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత శక్తిని ఉపాధ్యాయులు వెలికితీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నక్క యుగేందర్, వెంకటేశ్వర్లు, సత్యం, సీత, వెంకటయ్య, ఆంజనేయులు, జ్యోతి, గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**కట్టంగూర్ :** వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం కట్టంగూర్‌లో డ్రైవర్లకు, ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు డ్రైవింగ్ చేసేవారు సీట్ బెల్ట్ తప్పక ధరించి వాహనాలు నడపాలని సూచించారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. రాంగ్‌రూట్‌లో వెళ్లి ప్రమాదాలకు గురికావొద్దన్నారు. వైద్యులతో సీపీఆర్‌పై డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం ఆర్‌ఆర్‌ఆర్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ మునుగోటి రవీందర్, ఏఎస్‌ఐ అఫ్జల్, సిబ్బంది సతీష్, మునాస సత్యనారాయణ, మల్లేష్, శంకర్, వెంకన్న, గౌతమి, అనూష ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

## గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడండి

**తిప్పర్తి :** గ్రామాల్లో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఛాయాదేవి అన్నారు. తిప్పర్తి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో కృష్ణా జలాలు సక్రమంగా అందేలా , పైపులైన్ లీకేజీలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ జానయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సంపత్‌కుమార్, ఏఈ గంగాభవాని, ఏపీఓ శిరీష పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

**కనగల్:** ఇటీవల మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. మండల పరిధిలోని చిన్నమాదారం గ్రామానికి చెందిన వట్టికోటి ఎల్లేష్ ఇటీవల రైలు కింద పడి మృతి చెందాడు. అతడితోపాటు కలిసి చదువుకున్న స్నేహితులు రూ.60 వేలు సేకరించి ఎల్లేష్ కూతురు పేరిట డిపాజిట్ చేసి ఆ పత్రాలను కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. అంతకు ముందు ఎల్లేష్ చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వట్టికోటి సైదులు, అంజి, శంకర్, రాములు, సత్తయ్య, రమేష్, కోటి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



డిపాజిట్ పత్రాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

## తైక్వాండో, ఉడ్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**చండూరు :** పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన యునైటెడ్ నల్లగొండ జిల్లా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో గాంధీజీ పాఠశాలల విద్యార్థులు రేయాన్, మధుశ్రీ బంగారు పథకం, లనన్య,త్రాగ్వి,ఆదిత్య, అరవింద్‌లు రజత పతకాలు, రేవంత్, ఆయేషా అంజుమ్, యశ్వంత్, వీరజ్‌లు కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గాంధీజీ పాఠశాల కరస్పాండెంట్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, పులిపాటి రాధిక, ట్రైనర్ నాగిళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సన్‌షైన్ పాఠశాలకు చెందిన దాచేపల్లి వెంకటసాయి బంగారు పతకం సాధించాడు. పాఠశాల కరస్పాండెంట్ వెంకన్న విద్యార్థి వెంకటసాయిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సుష్మ, రవికాంత్, ప్రవీణ్, లతీఫ్ పాల్గొన్నారు.

**ఉడ్‌బాల్ పోటీల్లో సెంట్‌మేరి విద్యార్థులు..**

**మర్రిగూడ :** మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ నెల 22 నుంచి 26 వరకు జరిగిన జాతీయ స్థాయి 19వ సీనియర్, 13వ సబ్ జూనియర్ ఉడ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో మండల కేంద్రంలోని సెయింట్ మేరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. బాలికల సింగిల్ విభాగంలో రాష్ట్ర జట్టు తరుపున బంగారు పతకం సాధించగా.. బాలికల డబుల్స్ విభాగంలో రజత పతకం గెలుచుకున్నారు. అండర్–15 జూనియర్ బాలుర విభాగంలో రజత పతకం సాధించినట్లు రాష్ట్ర ఉడ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఆదర్శ్ తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల ఉడ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎండి.రహమత్, పటేల్ ఆక్రే, సునీత ఉన్నారు.



మర్రిగూడ: పతకాలతో సెయింట్‌మేరీ విద్యార్థులు

## సన్నబియ్యం పంపిణీలో జాగ్రత్తలు పాటించండి

**తిప్పర్తి :** ఉగాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనుండడంతో రేషన్ డీలర్లు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ కొత్తపల్లి పరుశురాములు సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత స్టాక్ దొడ్డు బియ్యం ఇవ్వకూడదని అన్నారు. అనంతరం ఇటీవల తిప్పర్తి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన పరుశురాములును డీలర్లు సన్మానించారు. కార్యక్రమంలో డీటీ ఆబేదా, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు లింగస్వామి పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని ధర్నా

**తిప్పర్తి :** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నన్నూరి వెంకటరమణారెడ్డి, మన్నెం భిక్షం, భీమగాని గణేశ్, రాములు, వెంకన్న, ఆకిటి లింగయ్య, శశిధర్, శరత్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

**పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి**

**మర్రిగూడ :** పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ రైతు సంఘం జిల్లా నాయకుడు బండ శ్రీశైలం గురువారం తహసీల్దార్ బక్క శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు కొట్టం యాదయ్య, వెంకటయ్య, రాఘవేంద్ర, సురేందర్, సల్వోజు రామలింగాచారి, గిరి వెంకటయ్య, అయిలి కృష్ణయ్య, మలిగిరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## నిరంతరాయంగా వైద్యసేవలు అందించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

**చిట్యాల:** ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలను నిరంతరాయంగా అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. చిట్యాల మున్సిపాలిటీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం రాత్రి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్, మందుల స్టాక్ పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోజువారీ రోగుల సంఖ్య, ఎన్ని డెలివరీలు చేస్తున్నారనే వివరాలను వైద్యాధికారి డాక్టర్ సత్యనరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో విద్యుత్ సమస్య ఉందని తెలపగా వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, అబార్షన్‌లను నియంత్రించాలని, అర్హులైన జంటలు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకునేలా ప్రోత్సహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దార్ విజయ, ఎంపీఓ సత్యనారాయణ, వైద్య సిబ్బంది ఉన్నారు.



చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

**మునుగోడు:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శం వేణుకుమార్ ఆరోపించారు. గురువారం మునుగోడు మండలంలోని కల్వలపల్లి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీల అమలుపై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కొత్త శంకర్, నాయకులు పర్నె అంతిరెడ్డి, శంకర్, పగిళ్ల సైదులు, ఉప్పరి నర్సింహ, గణేశ్, శ్రీరాములు పాల్గొన్నారు.

**చండూరు :** అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అమలు చేయాలని బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం చండూరు మున్సిపాలిటీ కేంద్రంలోని 2,5,6వ వార్డుల్లో బీజేపీ నిర్వహించిన ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్నవారితో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్ష్యుడు సోమ నర్సింహ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు భూతరాజు శ్రీహరి, బీజేపీ నాయకులు యాదగిరి, ఆంజనేయులు, శంకర్, పవన్‌కళ్యాణ్, శ్రీధర్, వెంకటేశం, స్వామి శ్రీకాంత్, అరుణోదయ, నరసింహ, రాము, రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వీఓఏల నిరసన

**రామగిరి(నల్లగొండ):** ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నల్లగొండ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ మండల సమాఖ్య కార్యాలయం ఎదుట వీఓఏలతో కలిసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు జిల్లపల్లి మంగ, కాసర్ల సువర్ణ, పి సంతోష పబ్బత్‌రెడ్డి సంధ్య, పద్మ, ధనమ్మ, అలివేలు, కృష్ణవేణి, కళ్యాణి, మంగమ్మ, పార్వతమ్మ, యాదమ్మ, శైలజ, మాధవి, జ్యోతి, సువర్ణ, కవిత, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**కట్టంగూర్ :** వీఓఏల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు అన్నారు. వీఓఏల చలో హైదరాబాద్ సందర్భంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీఓఏలు బండ నాగమణి, కంచర్ల సుజాత, శోభారాణి, లలిత, శైలజ, సరిత, ఉమ, నందిని, మమత, రేణుక ఉన్నారు.



నల్లగొండలో నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు

## పాస్టర్ మృతికి సంతాపంగా శాంతి ర్యాలీ




నల్లగొండ పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న సియాన్ యూత్ సభ్యులు

**రామగిరి(నల్లగొండ):** ఎంతోమంది నిరుపేదలకు సాయం అందిస్తూ విద్యాదానం చేస్తున్న పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి చెందడం సమాజానికి తీరని లోటని సియాన్ యూత్ సభ్యులు అన్నారు. రెండు రోజుల క్రితం ఏపీలో జరిగిన ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ మృతి చెందాడు. ఆయన మృతికి సంతాపంగా గురువారం స్థానిక పెద్ద గడియారం సెంటర్లో సియాన్ యూత్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పాస్టర్లు బిషప్ సమర్పన్ కుమార్, ఝాన్సీ, లాజరస్, ఐజాక్ రామ్, డేవిడ్, బెటాలియన్ పాస్టర్ రవి, పాస్టర్ లవన్ కుమార్, సియాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**మర్రిగూడ :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మండలంలోని పలువురికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ గురువారం అందజేశారు. యరగండ్లపల్లి గ్రామానికి చెందిన ఎడుదొడ్ల బాల్‌రెడ్డికి రూ.19వేలు, తొడేటి యాదయ్యకు రూ.60వేలు, బట్లపల్లి గ్రామానికి చెందిన సురిగి చంద్రమ్మకు రూ.48వేలు, కేశగోని నారాయణకు రూ.19వేల విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్, నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్‌రావు, మాజీ ఎంపీటీసీలు ఏర్పుల శ్రీశైలం , వెంకటంపేట బాలయ్య, మాజీ సర్పంచ్‌లు మాసశేఖర్, నగేష్‌యాదవ్, జంగిలి రవి, ఐతపాక జంగయ్య, నక్క తిరుపతయ్య, మాల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జమ్ముల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## రాచకాల్వలో శ్రమదానం

**శాలిగౌరారం:** మూసీనదిపై రామన్నపేట మండలం పల్లివాడ వద్ద ఉన్న హెడ్ రెగ్యూలేటర్ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చే ప్రధాన రాచకాల్వ వెంట తిరుమలరాయునిగూడెం, రామగిరి గ్రామాల రైతులు గురువారం శ్రమదానం చేశారు. తుర్కపల్లి, అమ్మనబోలు జాలుకుంటవద్ద పూర్తిగా ధ్వంసమైన తూముల నుంచి వృథాగా పోతున్న వరదనీటికి ఇసుక బస్తాలు, గడ్డికట్టలు అడ్డుగా వేసి నీటి వృథాను అరికట్టారు. కార్యక్రమంలో రైతు చామల వెంకటరమణారెడ్డి, శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడాల రమేశ్, పెంబెల్ల శ్రీను, శంకర్, అంజయ్య, సైదులు, అంజయ్య, రవి, నర్సింహ, యాదయ్య పాల్గొన్నారు.

## వీపీఓ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఆదిరెడ్డి

**మునుగోడు:** వీపీఓ (విలేజ్ పోలీస్ ఆఫీసర్) సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చండూరు సీఐ కె.ఆదిరెడ్డి కోరారు. మండలంలోని కొంపల్లి గ్రామంలో గురువారం గ్రామసభ ఏర్పాటుచేసి వీపీఓ అందించే సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏ సంఘటన జరిగినా వెంటనే వీపీఓకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మునుగోడు ఎస్‌ఐ ఇరుగు రవి, మాజీ ప్రజాప్రతినిథులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## తీరిన తాగునీటి సమస్య

**మర్రిగూడ :** తాగునీటి సమస్య తలెత్తకుండా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అందించిన పంప్ మోటార్‌ను గురువారం మండలంలోని తిరగండ్లపల్లి గ్రామంలో బిగించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఐతపాక జంగయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే తన సొంత నిధులతో మోటార్ పంప్‌ను అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, కార్యదర్శి శ్రవణ్, కొలుకులపల్లి శంకర్ పాల్గొన్నారు.